

జలపుష్పాల జాతర
మృగశిర కార్తె ఆదివారం ప్రారంభం అవుతుండడంతో చేపల క్రయవిక్రయాలు జోరుగా సాగనున్నాయి. 10లో



హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి
బడులు తెరిచేలోగా అన్ని హైస్కూళ్లలో హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 28°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

విపత్తును ఎదుర్కొనేలా..

వర్షాల వేళ డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ
- ముంపు ప్రాంతాల యువతతో బృందాల ఏర్పాటు
- వరద ముప్పును ఎదుర్కొనేలా కేఎంసీ సన్నద్ధత

గత ఏడాది మున్నేటికి వచ్చిన వరద ఖమ్మంలోని పలు కాలనీలను ముంచెత్తగా ప్రజలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వందలాది కుటుంబాలు నిరాశ్రయుల య్యాయి. భారీ మొత్తంలో ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ చేదు అనుభవం ఈ ఏడాది పునరావృతం కాకుండా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ముందస్తుగా అవగాహన కల్పించడమే కాక విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్



పరీవాహక ప్రాంత ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న అధికారులు



వరద బాధితులను బయటకు తీసుకురావడంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

సహాయక చర్యలపై శిక్షణ

వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనేలా డీఆర్‌ఎఫ్ సిబ్బందికి కేఎంసీ అధికారులు శిక్షణ ఇప్పిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు, ప్రథమ చికిత్స తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. అలాగే, గజ ఈతగాళ్లు, బోట్లు నడిపే వారు, మత్స్యకారులు, వరదల్లో చిక్కుకున్న వాహనాలను తొలగించే నైపుణ్యం కలిగిన వారిని బృందాలుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేయడం, త్వరగా స్పందించడంపై అవగాహన కల్పిస్తున్నారు.

స్థానికులకు అవగాహన

వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వరద వస్తుందని తెలియగానే వ్యవహరించాల్సిన తీరుపై మున్నేటి పరీవాహక ప్రాంత ప్రజలకు సైతం నగరపాలక సంస్థ అవగాహన కల్పిస్తోంది. ఇందు కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ వరద హెచ్చరికలను గుర్తించడం, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలను భద్రపర్చుకోవడం, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన తీరు, విద్యుత్ సరఫరా నిలిపివేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి శుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై వివరిస్తున్నారు. ఈ సదస్సుల్లో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు పాల్గొని స్థానికులకే కాక డీఆర్‌ఎఫ్ సిబ్బందికి జాగ్రత్తలను వివరిస్తున్నారు.

ముందస్తు ప్రణాళికలో..

వర్షాకాలం మొదలుకావడంతో అధికారులు అత్యవసర సమావేశాలు నిర్వహిస్తున్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు దఫాలుగా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో సమావేశమై వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. అవసరమైన పడవలు, రెస్క్యూ బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్లు, ఇతర పరికరాలు సమకూర్చుకోవడంపై సూచనలు చేశారు. వరద బాధితుల కోసం తాత్కాలిక పునరావాస కేంద్రాల గుర్తింపు, అక్కడ తాగునీరు, ఆహారం సమకూర్చడంపై దృష్టి సారించాలని తెలిపారు. వైద్యబృందాల ఏర్పాటు, అత్యవసర మందుల లభ్యతపై ఆరా తీయడమే కాక వరద తగ్గాక వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన పారిశుద్ధ్య చర్యలపైనా ముందస్తు ప్రణాళికలు రూపొందించారు.

పక్కా ప్రణాళికతో...



ఈ ఏడాది మున్నేటి వరదతో సమస్యలు రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభావిత డివిజన్ల యువతతో బృందాలను ఏర్పాటు చేశాం. దీంతో వారికి సమాచారం ఇచ్చి స్థానికులను అప్రమత్తం చేయించొచ్చు. వరద సహాయక చర్యల కోసం ఐదు ర్యాప్ బోట్లు కొనుగోలు చేస్తున్నాం. అంతేకాక రెండు డ్రోన్లు సమకూర్చున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

శ్రీవారికి అభిషేకం, పల్లకీసేవ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు తెల్లవారుజామునే స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి భారీగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, శ్రీవారికి పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత విషయంలో రాజీ పడొద్దు



అదనపు గదులను ప్రారంభించిన డైరెక్టర్

సత్తుపల్లిరూరల్: రక్షణ సూత్రాలు పాటిస్తూనే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు ఆదేశించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు కార్యాలయం పైఅంతస్తులో నిర్మించిన నూతన గదులను శనివారం ఆయన కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ప్లాస్టిక్ సంచుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. అనంతరం క్వారీని సందర్శించిన డైరెక్టర్ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై సమీక్షించారు. వర్షాకాలం నేపథ్యాన ఉత్పత్తికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి పీఓ ప్రహ్లద్, ఇంజనీర్ జీ.వీ.రావు, వివిధ విభాగాల అధికారులు రాజేశ్వరరావు, కల్యాణ్‌రామ్, నరేష్, అభిలాష్, గోవింద్, రవికుమార్, దేవదాస్, నాయకులు సుధాకర్, నర్సింహారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో కాయకల్ప బృందం



సీహెచ్‌సీ ఓపీ గదిలో పరిశీలిస్తున్న బృందం సభ్యులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కాయకల్ప బృందం సభ్యులు శనివారం సందర్శించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు బృందం పరిశీలన కొనసాగగా ఆస్పత్రిలో పరిశుభ్రత, ఓపీ రూమ్‌ల నిర్వహణపై డాక్టర్ బాలకృష్ణ, సిబ్బంది ఇందిర, విమల వివరాలు తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ నమోదు, ఆపరేషన్ థియేటర్, ఓపీ గదుల నిర్వహణ, మందుల లభ్యతపైనా ఆరా తీసిన వారు చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేశారు. జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలకు 596మంది హాజరు కాగా 241మంది(40.44 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షలు 839మంది రాయగా 486మంది ఉత్తీర్ణత సాధించడంతో 57.93శాతంగా నమోదైందని డీఈఓ ఎస్.సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 12నుంచి 18వ తేదీ వరకుwww.telanganaopenschool.org వెబ్‌సైట్ లేదా మీ సేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. రీ కౌంటింగ్ కోసం ఇంటర్ అభ్యర్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.400, పదో తరగతి వారైతే రూ.350 చెల్లించాలని తెలిపారు. అలాగే, రీవెరిఫికేషన్, జవాబుపత్రం జిరాక్స్ కోసం రూ,1,200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేడు జిల్లాకు మాజీ మంత్రి కేటీఆర్

రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ఆదివారం జిల్లాకు రానున్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో జరిగే మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సంతాపసభ (పెద్దకర్మ)లో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు కేటీఆర్‌కు స్వాగతం పలికేలా బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

రేపటి నుంచి మార్కెట్‌లో కొనుగోళ్లు

పత్తి యార్డులో అన్ని పంటలకు ఏర్పాట్లు

ఖమ్మంవ్యవసాయం: ఎండల తీవ్రత నేపథ్యాన నెల పాటు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలను నిలిచిపోగా, సోమవారం తిరిగి మొదలుకానున్నాయి. ఎండలు 40–45 డిగ్రీల మధ్య నమోదవుతుండడంతో కార్మికులు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గం వినతితో సెలవులు ప్రకటించారు. మే 9న మొదలైన సెలవులు ఆదివారంతో ముగియనుండగా, తిరిగి సోమవారం నుంచి మార్కెట్‌లో కొనుగోలు మొదలుపెడుతున్నట్లు వెల్లడించారు.

అన్నీ పత్తి యార్డులోనే...

మిర్చి యార్డులో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో అన్ని పంటల కొనుగోళ్లు పత్తి యార్డులో చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు మిర్చి, పత్తి, అపరాలకు ప్రత్యేక షెడ్లను కేటాయించారు. ప్రస్తుతం మిర్చి, కొద్ది మేర పత్తి, యాసంగిలో పండిన పెసలు, మొక్కజొన్నలను విక్రయానికి తీసుకొచ్చే అవకాశముంది. అలాగే, మిర్చి ధర పెరిగితే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన పంటలను రైతులు తీసుకురానున్నారు. వానాకాలం సీజన్ పెట్టుబడికి అవసరమైన నగదు కోసం రైతులు ఇళ్లు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన పంటలను తీసుకొచ్చే అవకాశముండడంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేడు, రేపు ఐసెట్

ఖమ్మం సహకారనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐసెట్ ఆది, సోమవారాల్లో జరగనుంది. జిల్లాలోని ఐదు ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేయగా రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు, మధ్యాహ్నం 2–30నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. కాగా, ఉదయం పరీక్షకు 8నుంచి 9–45గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2–15గంటల వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారు.

రేపటి నుంచి డీసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: బీఈడీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు(టీజీడీఈఈ సీఈటీ – డీ సెట్)లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. ఖమ్మంలోని డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 9నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సర్టిఫికెట్ల పరిశీలన కోసం నాలుగు బృందాలను నియమించారు. అర్హత సాధించిన అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ సూచించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్





ఖమ్మం గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు, (ఇన్‌సెట్) పరస్పరం శుభాకాంక్షలు చెప్పకుంటున్నచిన్నారులు

జిల్లావ్యాప్తంగా ముస్లింలు శనివారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే సమీప ఈద్గాలు, మసీద్‌లకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడ బక్రీద్ విశిష్టతను మతపెద్దలు వివరించారు. ఆతర్వాత ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని ఇళ్లకు చేరుకుని శక్తి మేరకు ఖుర్బానీ(మాంసం)ని పేదలు, స్నేహితులకు పంపిణీ చేశారు. అలాగే, కుటుంబ పెద్దల సమాధుల వద్ద నివాళులు అర్పించి ప్రార్థన నిర్వహించారు.

- ఫొటోలు 11లో

క్లుప్తంగా

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు అందుకున్న వారితో నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన రఘునాథపాలెం మండలం మల్లెమడుగులో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ పాల్గొని క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, క్యాంప్ ఇన్‌చార్జి బి.కృష్ణయ్య పాల్గొన్నారు.

'విద్యావ్యాపారులతో కుమ్మక్కైన అధికారులు'



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే నిబంధనలకు విరుద్ధంగా కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, జిల్లా కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పలు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కనీస ప్రమాణాలు పాటించకుండా సంపాదనే లక్ష్యంగా వ్యాపారానికి పాల్పడుతున్నాయని విమర్శించారు. పేద వర్గాల వద్ద అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులు గుంజుతున్నారని పేర్కొన్నారు. అయితే, నిబంధనలు పాటించని ఏ ప్రైవేట్ విద్యాసంస్థపైనా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు తిప్పారపు లక్ష్మణ్, కిరణ్, పృథ్వీ, కార్తీక్, యశ్వంత్, సందీప్, చంద్రశేఖర్, వినయ్, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ.2.70కోట్లు



పాత హాస్టల్ ఆవరణలో పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. ఇక్కడ హాస్టల్ ఆవశ్యకతను గుర్తించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో నిధులు మంజూరు చేశారు. దీన్ని పాత హాస్టల్ స్థలంలో నిర్మించనుండగా, స్థలాన్ని శుభ్రం చేయించే పనులను శనివారం ఐడీసీ ఈఈ విన్సెంట్‌రావు, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి ప్రారంభించారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణతో పాటు యలమంద, నవీన్, బోడ రమేష్ పాల్గొన్నారు.

జలపుష్పాల జాతర..

నేడు మృగశిర కార్తె

- జిల్లాలో 150టన్నుల మేర చేపల విక్రయానికి ఏర్పాట్లు
- స్థానిక చెరువుల నుంచే కాక ఏపీ నుంచి దిగుమతి



తిరుమలాయపాలెంలోని చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

ఖమ్మంవ్యవసాయం: మృగశిర అనగానే గుర్తుకొచ్చేది చేపలు. ఈ కార్తె తొలిరోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. మృగశిర వచ్చిందంటే వర్షాకాలం ఆరంభమైనట్లుగా భావిస్తారు. ఇదేరోజు హైదరాబాద్‌లో ఉబ్బసం, ఆయాసం ఉన్న వారికి చేపమందు వేస్తుంటారు. వేసవిలో ఉష్ణోగ్రతలతో శరీరంలో వేడి ఎక్కువగా ఉంటుందని, చేపల తింటే వేడి దూరమవుతుందని నమ్ముతారు. అందుకే ఏటా మృగశిర కార్తె ఆరంభమవుతున్న ఆదివారం చేపల విక్రయాలు జోరుగా సాగనున్నాయి.

ఇప్పటికే దిగుమతి

జిల్లాలో మృగశిర కార్తె సందర్భంగా దాదాపు 150 టన్నులకు పైగా చేపలు అమ్ముడవుతాయని అంచనా. ఈమేరకు విక్రయదారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో ఆదివారం చేపల విక్రయాలు భారీగా జరుగుతాయని భావిస్తున్నారు. కేవలం ఖమ్మం నగరంలోనే సుమారు 40 నుంచి 50 టన్నుల చేపలు విక్రయించే అవకాశముంది.

చేపల లభ్యత లేక...

చేపల లభ్యత జిల్లాలో తక్కువగా ఉండడంతో వ్యాపారులు ఏపీలోని పలు జిల్లాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వాహనాల్లో చేపలు తెప్పించగా ఐస్‌బాక్సులు, ఆక్సిజన్ ట్యాంకుల్లో నిల్వ చేశారు. ఎక్కువగా ఏలూరు, కైకలూరు, బాపట్ల, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి తెప్పించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



ఖమ్మం త్రీటౌన్ చేపల మార్కెట్‌లో కొనుగోళ్లు

రకం ఆధారంగా డిమాండ్

కొన్ని నెలల క్రితం కోళ్లకు వైరస్, బర్డ్ ఫ్లూ వస్తుందన్న ప్రచారంలో అమ్మకాలు పడిపోయాయి. అదే సమయాన మటన్, చేపల విక్రయాలు జోరందుకున్నాయి. కానీ మటన్ ధర ఎక్కువగా ఉండడంతో చాలా మంది ఆదివారం వస్తే చేపల వైపే మక్కువ చూపుతున్నారు. ఇక మృగశిర కార్తె సందర్భంగా డిమాండ్‌తో పాటే ధర పెరుగుతుందని భావిస్తున్నారు. సహజంగా కొర్రమేను చేపలకు అధిక ధర ఉంటుంది. ఇవి కాక బొచ్చెలు, రవ్వలు, గ్యాస్‌కట్‌లు, బంగారు తీగలు వంటి రకాల ధర కిలోకు రూ.200 నుంచి రూ.220 వరకు పలికే అవకాశముంది.

ఏటా ఆనవాయితీ..



మృగశిర కార్తె ఆరంభం రోజున చేపలు తింటే మంచిదనే నమ్మకంతో ఆనవాయితీగా పాటిస్తున్నాం. అంతేకాక చేపలు పుష్టికరమైన ఆహారం. ప్రస్తుత తరుణంలో చేపలు తింటే ఉబ్బసం, ఆయసం వంటి వ్యాధులు రావని పెద్దలు చెబుతారు.

– సోమారపు సుధీర్, ప్రకాష్‌నగర్, ఖమ్మం

డిమాండ్ పెరిగింది..



ఆదివారం మృగశిర కార్తె అయినా శనివారం సాయంత్రం నుంచే చేపలకు డిమాండ్ పెరిగింది. స్థానిక చెరువుల నుంచే కాక ఏపీ నుంచి కూడా తెప్పించాం. పలువురు ముందుగానే ఇష్టమైన రకాల చేపల కోసం డబ్బు చెల్లించి ఆర్డర్ ఇచ్చారు.

– రేణుక, చేపల విక్రయదారురాలు, ఖమ్మం

ఆరోగ్యానికి ఎంతో మేలు



చేపలు మంచి పోషకాలు ఉన్న పుష్టికరమైన ఆహారం. చేపలు తింటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. మృగశిర సందర్భంగా చేపల విక్రయాలు పెరుగుతాయి. స్థానిక చెరువుల్లో ఇప్పటికే మత్స్యకారులు చేపలు పడుతున్నారు.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



విద్యార్థికి అడ్మిషన్ పత్రం ఇస్తున్న సీఎంఓ రాజశేఖర్

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని.. అందులో భాగంగానే రూ.కోట్ల నిధులు కేటాయిస్తూ పాఠశాలల్లో అన్ని వసతులు సమకూరుస్తోందని జిల్లా విద్యాశాఖ సీఎంఓ యలగందుల రాజశేఖర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని వెంకటాయపాలెం, వేపకుంట్ల తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన ర్యాలీల్లో ఆయన పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండగా, ఉచిత విద్య, యూనిఫాం, పాఠ్య పుస్తకాలే కాక నాణ్యమైన భోజనం అందుతోందని తెలిపారు. ఇవేకాక గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు నమోదైన అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంపునకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కాగా, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య నిర్వహణపై వంట, పారిశుద్ధ్య కార్మికులకు ఈనెల 9, 10వ తేదీల్లో ఖమ్మంలో జిల్లా స్థాయి శిక్షణ, ఆతర్వాత 10, 11వ తేదీల్లో మండల, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు సీఎం రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు నారాయణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పెద్దాస్పత్రి

కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన వ్యర్థాలు



ఆస్పత్రిలోని వార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో కార్మికుల సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు విధుల్లో చేరేది లేదని కార్మికులు స్పష్టం చేస్తూ విధులకు దూరంగా ఉన్నారు. దీంతో జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చెత్తాచెదారం, మెడికల్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో బాత్‌రూమ్‌ల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే తాగునీటి కష్టాలు కూడా మొదలయ్యాయి. సెక్యూరిటీ, పేషంట్ కేర్ సేవల్లోనూ ఇబ్బందులు తలెత్తగా, సెక్యూరిటీ కార్మికులు విధులు దూరంగా ఉండడంతో రక్షణపై ఆందోళన నెలకొంది. కాగా, సమ్మెలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా కార్మికుల వేతనాల సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకెళ్లామని, రెండు, మూడు రోజుల్లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా మున్సిపల్ కార్మికుల సేవలు నియోగించుకుంటున్నామని వెల్లడించారు.

క్రికెట్ ఆడేందుకు వెళ్తూ మృత్యువాత

కోళ్ల వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి



సాత్విక్ (ఫైల్)



జగదీష్ (ఫైల్)

వేంసూరు: స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడదామని బయలుదేరిన ఇద్దరు యువకులు మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డారు. వేంసూరు మండలంలో శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. వేంసూరు మండలం భరణిపాడు గ్రామానికి చెందిన మల్లెపూల సాత్విక్, సూరటి జగదీష్, విస్సంపల్లి జస్వంత్ స్నేహితులు. మర్లపాడులో క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ముగ్గురు కలిసి బైక్‌పై బయలుదేరారు. అయితే, కందుకూరు దాటాక మర్లపాడు దగ్గరలో భరణిపాడు వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా సాత్విక్(22) ఘటనాస్థలిలో మృతి చెందాడు. జగదీష్(21)ను ఖమ్మం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. అలాగే, జస్వంత్‌కు సత్తుపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చేతికి వచ్చిన కుమారులు మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది.

సబ్‌స్టేషన్ ఫెన్సింగ్ ధ్వంసం

నేలకొండపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం ఇస్తే ఉద్యోగ విషమంలో మోసం చేశారంటూ ఓ వ్యక్తి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాడు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన ఆకుల నరసింహారావు 11ఏళ్ల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అవసరమైన స్థలం ఇచ్చాడు. అప్పట్లో తనకు ఉద్యోగం ఇస్తామని చెప్పగా, ఆతర్వాత మోసం చేశారని ఆయన ఆరోపిస్తున్నాడు. నాలుగేళ్లు పనిచేయించుకుని వేతనం కూడా ఇవ్వలేదని చెబుతున్నాడు. ఇందులో భాగంగా భూమిని స్వాధీనం చేసుకుంటానంటూ శనివారం సబ్‌స్టేషన్ ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేయగా విద్యుత్ ఉద్యోగుల ఫిర్యాదుతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నరసింహారావు మాట్లాడుతూ వారంలోగా తనకు న్యాయం చేయకపోతే భూమి స్వాధీనం చేసుకుంటానని స్పష్టం చేశాడు.

మహిళా ఎస్సైతో దురుసు ప్రవర్తన

ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

కల్లూరు: విధినిర్వహణలో ఉన్న కల్లూరు ఎస్‌ఐ డి.హరితతో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ రఘు వెల్లడించారు. కల్లూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. కల్లూరులోని చౌదరి హోటల్ వద్ద తల్లాడకు చెందిన రాయల రామారావు తదితరులు శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో గొడవ చేస్తున్నారని యాజమాని మాగంటి బోసుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ సమయానికి వెళ్లిపోయిన రామారావు తిరిగి పలువురితో వచ్చి హోటల్ సిబ్బంది, యాజమానిని బెదిరించాడు. తనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే హోటల్‌ను నడవనిచ్చేది లేదని హెచ్చరిస్తుండగా ఎస్‌ఐ హరిత, సిబ్బందితో వచ్చారు. మద్యం మత్తులో ఉన్న రామారావు, ఆయన అనుచరులను పంపించే ప్రయత్నంలో ఎస్సై, సిబ్బంది విధులను ఆటంకపరుస్తూ దాడి చేశారు. ఈమేరకు ఎస్‌ఐ ఫిర్యాదుతో పది మందిపై కేసు నమోదు కాగా, ప్రధాన నిందితుడు రాయల రామారావుతో పాటు ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, రామారావుపై గతంలోనూ తల్లాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని వెల్లడించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, కల్లూరు, పెనుబల్లి ఎస్‌ఐలు డి.హరిత, వెంకటేష్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

చింతకాని: చింతకాని మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. నిందితుడైన ఖమ్మం కార్పొరేషన్ పరిధి కొత్తగూడెంకు చెందిన షేక్ ఇర్ఫాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వైరా సీఐ సాగర్ తెలిపారు. కాగా, బాలికపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడు ఇర్ఫాన్‌ను కఠినంగా శిక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి తదితరులు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

ముగ్గురు విలేకరులపై కేసు

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన ముగ్గురు విలేకరులపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. కారు పార్కింగ్ విషయమై ముగ్గురు విలేకరులు తనతో దౌర్జన్యంగా ప్రవర్తించారని ద్వారకానగర్‌కు చెందిన వెంకటకృష్ణ ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అయితే, వెంకటకృష్ణ, ఆయన కుటుంబీకులు తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని విలేకరులు ఫిర్యాదు చేయగా ఇంకో కేసు నమోదు చేశామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

చర్ల: వేసవి సెలవులు ముగిసే లోగా ఖాళీగా ఉన్న 700 హైస్కూలు ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. శనివారం చర్లలో టీఎస్ యూటీఎఫ్ నాయకుడు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఐదు డీఏలకు ఒక్క డీఏ మాత్రమే ఇచ్చి ప్రభుత్వం ఉద్యోగులను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అన్ని యాజమాన్యాల ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. పీఆర్సీ ఇప్పటికే 23 నెలలు ఆలస్యమైనందున వెంటనే నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ బడిబాట ముగిసే వరకు ఉపాధ్యాయుల సర్దుబాటును వాయిదా వేయాలని, మెమో 1267ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్, రాష్ట్ర కమిటీ సభ్యులు నంది కృష్ణ, జిల్లా కార్యదర్శి సోడె విజయ్ కుమార్, గిరిజన సంక్షేమ విభాగం కన్వీనర్ తేజావత్ బాలు, మండల ప్రధాన కార్యదర్శి ఉయిక బాలకృష్ణ, ఎం.యాడమరాజు, హిమగిరిబాబు, శ్యామల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.